## ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ సిద్ధం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 10 : దేశవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో నిఘా పెంచినట్లు, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉన్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రధాన బస్టాండ్లు, రైల్వే స్టేషన్, ప్రధాన రహదారుల వెంట బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపడుతున్నటుల పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మవద్దని, ప్రభుత్వ అధికారిక ప్రకటనలు మాత్రమే నమ్మాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

## కిరాణం యజమానిపై కేసు



శాంపిల్ సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

లక్షెట్టిపేట, మే 10 : మున్సిపాలిటీ పరిధి గోదావరి రోడ్డుకు చెందిన కిరాణా దుకాణ యజమాని శ్రీనివాస్‌పై కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ అమ్ముతున్నాడని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ గోపతి సురేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయికరణ్ శుక్రవారం శ్రీనివాస్ దుకాణంలో కూల్ డ్రింక్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి పిల్లలకు తాగించగా, అస్వస్థతకు గురై, వాంతులు చేసుకున్నారు. స్థానిక ప్రైవేటు దవాఖానలో చికిత్స చేయించి, రాత్రి దుకాణం ఎదుట స్థానికులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు. పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం మంచిర్యాల నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు నరేశ్, అంజిత్ దుకాణంలో తనిఖీ ఏశారు. కూల్ డ్రింక్స్, ఇతర పది రకాల వస్తువులను స్వాదీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించామని ఎస్ఐ తెలిపారు. సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## ఇద్దరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, మే 10 : పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతల మోసెస్, పాస్తం నరేశ్‌ను శనివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. మంచిర్యాల రాంనగర్‌లో పీడీఎస్ రైస్ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామని పేర్కొన్నారు. మోసెస్ ఇంటి ఆవరణలో ఉన్న బొలేరో వాహనంలో దాచి ఉంచిన 35 క్వింటాళ్లు, అలాగే పాస్తం నరేశ్ ఇంటి వద్ద టాటా మ్యాజిక్‌లో దాచి ఉంచిన 15 క్వింటాళ్ల బియ్యం గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరినీ శనివారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం విక్రయించినవారిపై ప్రభుత్వ పరంగా చర్చలు తీసుకోనున్నట్లు సీఐ వెల్లడించారు.

## సమ్మె జయప్రదం చేయండి

ఆసిఫాబాద్ టౌన్, మే 10 : దేశవ్యాప్తంగా 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టీ దివాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సమ్మె వాల్‌పోస్టర్లను ఆర్టీసీ కార్మికులతో కలిసి విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అధ్యక్షుడు అశోక్, పీహెచ్‌బీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు స్వామి, నారాయణ పాల్గొన్నారు.

### 18న సీపీఐ మహాసభలు..

మందమర్రి, మే 10 : మందమర్రి పట్టణంలో 18న నిర్వహించతలపెట్టిన సీపీఐ 11వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా సమితి సభ్యుడు సలేంద్ర సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమనాథుని సుదర్శన్, పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్, నాయకులు బండారి రాజేశం, బియ్యాల పద్మ, ఆంటోని దినేశ్, ఆర్ జనార్దన్, ఉప్పులేటి తిరుపతి, సుంకరి శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

## సమ్మర్ శిబిరాలు విద్యార్థులకు వరం



విద్యార్థులు తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్‌లను పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల, మే 10 : సమ్మర్ శిబిరాలు విద్యార్థులకు వరం లాంటివని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాఫ్ట్ టీచర్ సంగీత నేర్పించిన పేపర్‌తో తయారు చేసే పూలు, బొమ్మలు, ఇతర అలంకర వస్తువులను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అదే విధంగా విద్యార్థులు యోగా, కరాటే, డ్యాన్స్, ఇండోర్ గేమ్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపు ఇన్‌చార్జీలుగా మార్త రమేశ్, శివాజీ వ్యవహరిస్తున్నారు.

## ఉద్యోగులకు ఇన్సెంటీవ్ బోనస్

కాసిపేట, మే 10 : మందమర్రి ఏరియా కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై మొదటి, రెండో షిఫ్ట్‌లో ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఉద్యోగుల అంకిత భావాన్ని గుర్తిస్తూ వారికి ఇన్సెంటివ్ బోనస్ అందించనున్నట్లు సింగరేణి ఐఈడీ డీజీఎం రాజన్న తెలిపారు. ఈ మేరకు గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్సెంటీవ్ బోనస్ వివిధ కేటగిరీల ఉద్యోగులకు ఎలా వర్తిస్తుందో వివరించారు. ఉద్యోగులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు ఇచ్చారు. గని మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇన్సెంటీవ్ బోనస్ స్కీమ్ నిర్ణయం వల్ల ఉద్యోగులకు మరింత ప్రేరణ కలిగిస్తుందని, అధిక ఉత్పాదకత సాధనకు దోహదపడుతుందన్నారు. పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ రవి శంకర్, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు



మందమర్రిలోని పీహెచ్‌సీ వద్ద నిర్మించిన బస్ షెల్టర్



పాత బస్టాండ్‌లో ఫుట్‌పాత్‌పై ఎండలో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

# అవగాహన లోపం.. ప్రయాణికులకు శాపం

- బస్సు ఆగేది ఒక చోట.., షెల్టర్ మరోచోట
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నిర్వాకం
- ఎండలో రోడ్డుపైనే ప్రయాణికుల అవస్థలు
- ఉపయోగకరంగా నిర్మించాలని వేడుకోలు

*మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బస్ షెల్టర్ నిర్మాణంలో జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారుల అవగాహన లోపం ప్రయాణికులకు శాపంగా మారింది. నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అధికారులు గతంలో ఉన్న బస్ షెల్టర్ తొలగింపుతో ప్రయాణికులకు సమస్య మొదలైంది. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత అవగాహనా లోపం, నిర్లక్ష్యంతో పాత ప్రాంతంలో కాకుండా దూరంగా షెల్టర్ ఏర్పాటు చేయడం కష్టంగా మారింది. రోడ్డుపై ఎండలో అవస్థలు పడుతుండగా, అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.* - మందమర్రి, మే 10

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరి సౌకర్యార్థం గతంలో పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దానిని తొలగించారు. రోడ్డు నిర్మాణం అనంతరం బస్సులు నిలిపే చోట కాకుండా దూర ప్రాంతంలో పాతబస్టాండ్–యాపల్ ఏరియాకు మధ్యలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. కానీ, బస్సులు మాత్రం పాతబస్టాండ్ చౌరస్తా, యాపల్ ఏరియాలో నిలుపుతున్నారు. పాత బస్టాండ్, యాపల్ ఏరియాల మధ్యలో ఉన్న షెల్టర్.. ప్రయాణికులు పాత అలవాటు ప్రకారం పాత బస్టాండ్‌తో పాటు, యాపల్ ఏరియాలో వేచి ఉంటుండడంతో నిరుపయోగంగా మారింది. ఇక్కడ ప్రయాణికులు, పిల్లలు బస్సుల కోసం ఫుట్‌పాత్‌పై ఎండలో వేచి చూస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా సమస్య పరిష్కరించడంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అధికారుల అవగాహన లోపం మూలంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని బస్సులు నిలిపే చోట షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

## కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి



ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావును సన్మానిస్తున్న మంచిర్యాల న్యాయవాదులు

మంచిర్యాల అర్బన్, మే 10 : న్యాయవాద వృత్తిలో కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సుచిత్ర ఇన్ హోటల్‌లో శనివారం ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న న్యాయవాదుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో రోజురోజుకూ అనేక కొత్త చట్టాలు వస్తున్నాయని, వాటిపై న్యాయవాదులకు శిక్షణ అవసరమన్నారు. ప్రతీ న్యాయవాదికి క్రమశిక్షణ, నిబద్ధత, చట్టాలపై అవగాహన లేకుండా వృత్తిలో విజయం సాధించలేమని పేర్కొన్నారు. బాధ్యతతో బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారధి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల ఏమాజీ, జాడి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి శైలజ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి మురళి, సీనియర్ న్యాయవాదులు రాజన్న, చిట్ల రమేశ్, రాజేశ్ గౌడ్, రవీందర్రావు, రవీందర్, భుజంగరావు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీలో పాల్గొన్న యువకులు

బెల్లంపల్లి, మే 10 : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామ నీలగిరి ప్లాంటేషన్‌లో శనివారం ఐదు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. 'వనంలో మనం– ఆరోగ్యం కోసం నడక' పిలుపుతో నిర్వహించిన ఈ పోటీలను కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి జెండా ఊపి ప్రారంభించారు. బెల్లంపల్లి, సోమగూడెం ప్రాంతానికి చెందిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చని చెట్ల నడుమ నడక పోటీలు ఆరోగ్యంతో పాటు, మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఎస్ కిరణ్(ప్రథమ), సీహెచ్ అఖిల్(ద్వితీయ), జంపం తిరుపతి(తృతీయ) విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్లు బెల్లంపల్లి రేంజ్‌కు చెందిన వీ సునీత, మంచిర్యాల రేంజ్‌కు చెందిన గోగు సురేశ్ కుమార్, కాగజ్‌నగర్ రేంజ్‌కు చెందిన ఎడ్ల లక్ష్మణ్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జే నరేశ్, పాత బెల్లంపల్లి మాజీ సర్పంచ్ రామస్వామి, నాయకులు కందుల సదానందం, మేకల పవన్, రాజు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న సింగరేణి డీడీఎంఎస్ రాజీవ్ ఓం ప్రకాశ్ వర్మ

మందమర్రి, మే 10 : భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని సింగరేణి డీడీఎంఎస్(ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాశ్ వర్మ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఎలక్ట్రికల్ సేఫ్టీ, సాంకేతిక ఇంటరాక్టివ్ సెషన్‌లో మాట్లాడారు. మందమర్రి ఏరియాలోని కేకేఓసీ, కేకే 5 గనుల్లో నాలుగు రోజుల పాటు సాధారణ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ అపాయాల నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, ఏఎస్‌వో రవీందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, కేకేఓసీ పీవో మల్లయ్య, ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి



కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్

లక్షెట్టిపేట, మే 10 : రైతుల నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ పేర్కొన్నారు. లక్షెట్టిపేట మండలం మిట్టపల్లిలోని శ్రీ శివరామకృష్ణ ట్రేడర్స్ రైస్ మిల్లును శనివారం సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లోడును తక్షణమే దిగుమతి చేసుకొని, వాహనాలను తిరిగి పంపించాలని తెలిపారు. ఈ క్రమంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. అకాల వర్షాల సమయంలో కేంద్రాల్లో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. తహసీల్దార్ దిలీప్ కుమార్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలతో సమావేశం

కాసిపేట, మే 10 : కాసిపేట మండలం దేవాపూర్ శివారులో అటవీ ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్న గ్రామస్తులు, తల్లిదండ్రులతో దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ రమేశ్ పని స్థలంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. 16, 23, జూన్ 6న తల్లిదండ్రుల సమావేశానికి తప్పకుండా రావాలని కోరారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రములో ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

## ప్రతి పల్లెలో బీసీ జెండా ఎగరాలి

జన్నారం, మే 10 : ప్రతి పల్లెలో బీసీ జెండాలు ఎగురవేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో చేపట్టిన బీసీ మేల్కొలుపు రథయాత్ర శనివారం జన్నారం మండలానికి చేరుకున్నది. అంబేద్కర్, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. దేశ జనాభాలో 90 శాతం ఉన్న బీ సీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. అందరం ఐక్యతతో రాజకియంగా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కోకన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, కాశెట్టి లక్ష్మణ్, నర్సాగౌడ్, గోపి సత్యనారాయణ, ఎస్ గంగాధర్, కడర్ల నర్సయ్య, అశోక్, రవి, మూల భాస్కర్ గౌడ్, గుడ్ల రజన్న, సత్తిగౌడ్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలి

కన్నెపల్లి, మే 10 : నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూమి పంపిణీ చేయాలని, అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైరవీలు లేకుండా అర్హులకు ఇండ్లు ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గ్రామాలకు తరలండి' శనివారం కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చేరుకున్నది. ప్రజల సమస్యలపై ఆట, పాటల ద్వారా ప్రజలకు వివరించారు. గ్రామంలోని కాలనీలు తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. నాయకులు లాల్‌కుమార్, గౌతమ్‌కుమార్, తిరుపతి, చరణ్, గణేశ్, దీపలక్ష్మి, తిరుపతి, మనోహర్, మధునయ్య, సంపత్, సాగర్, పార్వతి, మమత, లక్ష్మి, సుజాత, రాజన్న, సంపత్, వంశీ, యశోద, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రెంటీస్ మేళా వినియోగించుకోవాలి

మందమర్రి రూరల్, మే 10 : మందమర్రి మండలంలోని ప్రభుత్వ ఐటీఐలో 12న నిర్వహించే ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు మేళా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు నిజ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని, వివరాలకు 70138 46573 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## 12 నుంచి ఇంటర్వ్యూలు

రెబ్బెన, మే 10 : రాజీవ్ యువ వికాసం పథకంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో 12 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న పులికుంట, తక్కలపల్లి, రాజారం, ధర్మారం, లక్ష్మీపూర్, రోళ్లపహాడ్.., 13న కిష్టాపూర్, నారాయణపూర్, 14న నంబాల, జక్కులపల్లి, పాసిగాం.., 15న తుంగెడ, మదావాయిగూడ జీపీల అభ్యర్థులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

## యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్

చెన్నూర్, మే 10 : భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా చెన్నూర్ పట్టణానికి చెందిన సిద్ది రమేశ్ యాదవ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ యాదవుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, మే 10 : బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న లోడర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. ఈ మేరకు శనివారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఎస్ఈ కోటయ్యకు వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు, సీఎంపీఎఫ్ పూర్తి వివరాలు తెలియజేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లోడర్ ఆపరేటర్స్ నారాయణ, రాజు, మహేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి బంద్ విజయవంతం చేయండి

భీమారం, మే 10 : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో వీరమరణం పొందిన అమరులకు నివాళిగా సోమవారం నిర్వహించే భీమారం మండల బంద్‌కు అందరూ సహకరించాలని వర్తక వ్యాపారులు, యువత కోరారు. మండలంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని పేర్కొన్నారు. భీమారం అన్ని వర్తక వ్యాపార, కులసంఘాలు, పార్టీల నాయకులు పాల్గొనాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్ రూరల్, మే 10 : చెన్నూర్ మండలం ఆస్నాద్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొమ్మెర ఏఈ కేశెట్టి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పొక్కూర్‌లో పగలే వెలుగులు



పొక్కూర్‌లో పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

చెన్నూర్ రూరల్, మే 10 : చెన్నూర్ మండలం పొక్కూర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు పగలే వెలుగులు పంచుతున్నాయి. పలు చోట్ల వివిధ కారణాల వల్ల పగలు, రాత్రీ తేడా లేకుండా వెలుగుతున్నాయి. హైమాస్ట్ లైట్లకు అధిక లోడ్ ఉంటుండగా, విలువైన విద్యుత్ వృథా అవుతుండడంతో పాటు, బిల్లుల రూపంలో అదనపు భారం పడుతుంది. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాల తనిఖీ



వెల్గనూర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

దండేపల్లి, మే 10 : దండేపల్లి మండలం ముత్యంపేట, కొర్విచెల్మ, రెబ్బెన్‌పెల్లి, నెల్కివెంకటాపూర్, మాదాపూర్, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ గ్రామాల్లో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో కిషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు కొమువెల్లి, లావణ్య, తిరుపతి, జనార్ధన్, ఐకేపీ సిబ్బంది, రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

రామకృష్ణాపూర్, మే 10 : క్రీడలతో క్రమశిక్షణ, మానసికోల్లాసం, శారీరక ధృఢత్వం ఏర్పడుతుందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో శనివారం సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఈదునూరి రాంచందర్, బోయిన రవి స్మారక 'ఆర్‌ఆర్' మెమోరియల్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అతిథులుగా జీఎం దేవేందర్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దెరాజు హాజరయ్యారు. క్రీడాకారుల కుటుంబ సభ్యుల సమక్షంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. పోటీల నిర్వహణకు మంచిర్యాల వసుధ దవాఖాన యాజమాన్యం సహాయ సహకారాలు అందించినందకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియచేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 24 జట్లు పాల్గొననున్నాయని తెలిపారు. ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, స్థానిక ఎస్ఐ రాజశేఖర్, రెండో ఎస్ఐ లలిత, వసుధ దవాఖాన చైర్మన్ ప్రశాంత్, నాయకులు పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, కందునూరి రాజన్న, సీనియర్ క్రీడాకారులు కట్టా ఈశ్వరాచారి, రాజబద్రి, సంగం కిష్టయ్య, నిర్వహకులు పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో రాంచందర్‌కు నివాళి

కాసిపేట, మే 10 : దేవాపూర్ నాయికపుగూడలో శనివారం ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం వ్యవస్థాపకుడు మద్ది రాంచందర్ 25వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆదివాసుల సంప్రదాయం ప్రకారం జెండా ఎగురవేసి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తట్ర భీమ్‌రావ్, మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, మేగుగు శంకర్, మద్దిమాడ అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, రొడ్డ అనిల్, పెంద్రం ఇష్రు, రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ కొడప ప్రేంసాగర్, కొడప శ్యాంసుందర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మందమర్రి, మే 10 : రజక, నాయీబ్రాహ్మణులకు అందిస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో సంఘం పట్టణాధ్యక్షుడు గంగరాజులు రాంచంద్రం అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. జీవో 2 ప్రకారం ప్రభుత్వం రజక, నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు 250 యూనిట్ల విద్యుత్‌ను అందిస్తున్నదన్నారు. అందుకు సంబంధించి విద్యుత్ శాఖకు రూ.172 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగేపెల్లి వెంకటేశ్, పాయిరాల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సంగెపు హన్మంతు, ముస్కె చందు, పైతర్ ఓదెలు, కంచర్ల రాజమల్లు, బాలయ్య, సమ్మయ్య, రాములు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677